ప్రజాశక్తి
బుధవారం 18 జనవరి 2023
5
అల్లూరి సీతారామరాజు



జిఒ 1 కాపీలు దగ్ధం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మెరకచింత పంచాయతీలోని రంగసింగపాడు గ్రామంలో చీకటి జీవో 1 కాపీలను సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం సాయంత్రం మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణరావు మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం జీవో 1తో రాష్ట్రంలో ని ప్రజలు, ఉద్యోగులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు గొంతు నొక్కుతుందని విమర్శించారు. రోడ్డుపై సభలు, సమావేశాలు, నిరసనలు చేపట్టవద్దని పేర్కొనడం ఎంతవరకు భావ్యమన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ప్రజలందరూ తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వై.చిట్టిబాబు వి. మల్లన్న, వి.మహేష్, వి.సంజీవరావు, వి.బాలకృష్ణ, వి.సుబ్బారావు, ఎం.లచ్చన్న, వి.మొదకొండం నాయుడు, వి.కొండబాబు, వి.ఎర్రన్న, ఎం.చిలకమ్మ, వి. సుజాత పాల్గొన్నారు.



కాపీలు దగ్ధం చేస్తున్న గిరిజనులు

మన్యంలో మరణమృదంగం

ఇద్దరు పసికందులు, బాలింత మృతి

ప్రజాశక్తి-అనంతగిరి: అనారోగ్యంతో బాధపడుతూ అనంతగిరి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని ఇద్దరు పసికందులు వారం రోజులలోనే మృతి చెందారు. ఎగువశోభ పంచాయతీ పొర్నపొదొర్ గ్రామానికి చెందిన పొటంగి సుమిలకు జన్మించిన నాలుగు నెలల పాప అనారోగ్యంతో బాధ పడుతూ మంగళవారం మృతి చెందింది. ఇది ఇలా ఉండగా ఈనెల 12న అనంతగిరి పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన నందుల నవీన్‌కు జన్మించిన ఎనిమిది నెలల బాబు రక్తహీనత, బలహీనత వంటి సమస్యలతో బాధపడుతూ మృతి చెందాడు. నెల రోజుల క్రితం మూడు, నాలుగు నెలల పిల్లలు ముగ్గురు చనిపోయారు. దీంతో చిన్న పిల్లల తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అలాగే విపికోట ఆరోగ్య కేంద్రం పరిధి పెద్దకోట గ్రామానికి చెందిన కోనేపు సుశీల (29) బాలింత రక్తహీనతతో బాధపడుతూ సకాలంలో సరైన వైద్య సేవలు అందక మంచాన పట్టి మంగళవారం మృతి చెందింది.

మండలంలోని పలు పలు గ్రామాలలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మాతా శిశు మరణాలు అరికడతామని రాష్ట్ర ప్రభుత్వం చెపుతున్న మాటలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. బాలింతలు, పసికందుల మరణాలను అరికట్టడంలో విఫలమైందని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా బాలింతలు, గర్భిణీల, పసి పిల్లలు ఎంతో మంది మృతి చెందారని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.



బాలింత సుశీల మృతదేహం

వైద్య శిబిరం నిర్వహించాలి

సిపిఎం జెడ్‌పిటిసి డి.గంగరాజు

చిన్న పిల్లలు మరణిస్తున్న పొర్నపొదొర్‌లో వెంటనే ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి డి.గంగరాజు డిమాండ్ చేశారు. నెల రోజుల వ్యవధిలో నలుగురు పిల్లలు చనిపోయినా, వైద్యులు గ్రామాన్ని సందర్శించి పరీక్షించకపోవడం విచారకరమన్నారు.



తెగుళ్లతో నాసిరకంగా ఉన్న మిరప పంట

మిర్చి పంట.. రైతు కంట్లో మంట

- వరదల వల్ల ఆలస్యంగా సాగు

- తెల్ల, నల్ల తామర తెగుళ్ల దాడితో నష్టం

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ముంపు మండలాలలో మిర్చి పంట రైతు కళ్లలో మంట తెప్పిస్తున్నాయి. వదరల వల్ల పంట సాగు ఆలస్యం కాగా, తెల్ల, నల్ల తామర తెగుళ్లు ఉన్న పంటను నాశనం చేస్తున్నాయి. ముంపు మండలాల్లో అత్యధికంగా వేసే పంటలలో మిర్చి ఒకటి. ఇప్పుడు ఈ పంట వేయాలంటే రైతులు భయపడుతున్నారు. పోలవరం ప్రాజెక్ట్ వల్ల ఈ ఏడాది వరదలు ఎక్కువైన నేపథ్యంలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వేయాల్సిన పంటలు రెండు నెలలు ఆలస్యంగా అక్టోబర్ నుండి నవంబర్ నెలల్లో వేయడం జరిగింది. మొదట మిర్చి నారు పోసిన సమయంలోనే భారీగా వరదలు రావడంతో ఆ నారు ముంపునకు గురై పాడైపోయింది. వరదలు తగ్గిన తరువాత మళ్లీ నారు పోసి పంట ఆలస్యంగా వేశారు. దీనికి తోడు రెండేళ్లగా తెల్ల తామర, నల్ల తామర తెగుళ్లు పంటపై దాడి చేయడంతో దిగుబడి రావడం లేదని రైతులు వాపోతున్నారు. మిర్చి ధర ఒక క్వింటా రూ.18వేలు నుండి రూ.20వేలు వరకు ఉంది. అయితే పంట ఆలస్యంగా వేయడం, తామర తెగుళ్ల ప్రభావం దిగుబడిపై ఉంటుందని, నష్టం వాటిల్లనుందని రైతులు చెబుతున్నారు. మార్కెట్లో ఉన్న ఖరీదైన మందులను పిచికారీ చేస్తున్నామని, అయినా తామర తెగులు పోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా వరదలు, తెగుళ్ల కారణంగా ఈ ఏడాది మిర్చి పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

30వ రోజుకు రిలే నిరాహార దీక్ష

▸▸ స్పందించని అధికారులు ▸▸ పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-పాడేరు: ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఐటీడీఏ వద్ద చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో 30వ రోజుకు చేరుకున్నాయి. గత 30 రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నా అధికారుల్లో మాత్రం కనీస స్పందన కరువైంది. వివిధ కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళా సంఘాల డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి జవాబు దారి లేకుండా పోయింది. ఆశ్రమాల్లో విద్యార్థుల మరణాలపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. గిరిజన విద్యార్థుల మరణాల పట్ల నిర్లక్ష్య వైఖరి ఆలంభిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణను తక్షణమే సరెండర్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల వరుసగా జరిగిన ఆరుగురు గిరిజన విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఆశ్రమాల్లో విద్యార్థులకు కాస్మోటిక్స్ పంపిణీ పునరుద్ధరించాలని, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లలను నియమించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గిరిజన ఆశ్రమ విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై నెల రోజులుగా దీక్షలు చేపడుతున్నా అధికారులు, ప్రభుత్వం నుంచి స్పందన కాన రాకపోవడంపై అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



దీక్షలో కూర్చున్న నాయకులు

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్:

ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. ఐటిడిఎ కార్యాలయం .బి.ఆర్. అంబేద్కర్ సమావేశ మందిరంలో జెసి జె.శివ శ్రీనివాసుతో కలిసి గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో స్థానిక అలారిసింగి గిరిజన సంక్షేమ ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో గణతంత్ర దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై శకటాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వీటి రూపకల్పనతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన సహకార సంస్థ. పౌర సరఫరాలు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, కాఫీ విభాగం, డిఆర్‌డిఎ, అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో ప్రగతి శకటాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఐసిడిఎస్, గిరిజన సహకార సంస్థ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు సంయుక్తంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పటిష్టంగా ఏర్పాటు చేసి విజయవంతం చేయాలని పిఒ సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి విఎస్ ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఐ.కొండలరావు, డిఇఒ పి.రమేష్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఒ గోపాలకృష్ణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజల గొంతుక ప్రజాశక్తి

టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర

ప్రజాశక్తి -హుకుంపేట: ప్రజల గొంతు ప్రజాశక్తి దిన పత్రిక అని తెలుగుదేశం పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర కొనియాడారు. మండలం కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర, ఐసీడీఎస్ శిశు సంక్షేమ శాఖ అధికారి సిహెచ్ మణిదేవి చేతులు మీదుగా ప్రజాశక్తి క్యాలండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం దొన్ను దొర మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకొచ్చే పత్రిక ప్రజాశక్తి అని అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలపై దీటైన కథనాలు ప్రచురించే ఏకైక తెలుగు దిన పత్రిక ప్రజాశక్తి అని ఆయన కొనియాడారు. తన దైన శైలిలో వాస్తవిక కథనాతో మంచి గుర్తింపు పొందిందన్నారు. ప్రతి ఏటా అందమైన క్యాలండర్ రూపొందించి ఆకర్షించే విధంగా ప్రజాశక్తి గుర్తింపు దక్కించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బొడ్డా శ్యామ్, అరకు అసెంబ్లీ ఎస్ టి సెల్ కార్యదర్శి కొర్రా సంతోష్ కుమార్, ప్రజాశక్తి విలేకరి కొర్రా. ఆనంద్, ఆరమ మాజీ సర్పంచ్ సుబ్బారావు, జగన్ కుమార్, నాయకులు భీమన్నదొర, లచ్చన్నదొర, వెంకట్ జగన్, కర్రి బాబు, బుద్రన్న పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: అరకులోయ అంజలి రెసిడెన్సి వద్ద ఈనెల 18న అరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర పిసిసి డెలిగేట్ మెంబర్ పి.చిన్న స్వామి తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ సమావేశానికి పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జి రాకేష్ రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యపై మక్కువ చూపాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో లక్ష్మీపురం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యపై మక్కువ కనపర చాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, వీటికి దూరంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉండాలని కోరారు. సమస్యలు పరిష్కారం కావాలంటే విద్యా పరంగా అభివృద్ధి చెందాన్నారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను కుటుంబ సభ్యులు పాఠశాలలకు పంపించాలన్నారు. విద్య కోసం దూరం ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు పలు జాగ్రత్తలు పాటించి అప్రమత్తత కలిగి ఉండాలని తెలిపారు. వెనకబడిన తరగతుల విద్యార్థులను చైతన్య పర్చేందుకు యువత సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దలు వి సాధురం, కే.ఆనంద్, కే.హరి, తిరుపతి మాట్లాడుతూ, యువత గంజాయి రవాణా, సాగుకు పాల్పడవద్దని సూచించారు.



మాట్లాడుతున్న సర్పంచ్ త్రినాథ్

పట్టాలు తప్పిన కిరండూల్ ప్యాసింజర్

- తప్పిన పెను ప్రమాదం
- ఊపిరి పీల్చుకున్న ప్రయణికులు
- గంటల తరబడి ఆలస్యం

ప్రజాశక్తి -అనంతగిరి

విశాఖ -కిరండూల్ కేకే లైన్ మార్గంలో శివలింగపురం వద్ద కిరండూల్ ప్యాసింజర్ పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున విశాఖలో బయలుదేరిన పాసింజర్ రైలు ఉదయం 9:30 గంటల సమయంలో శివలింగపురం స్టేషన్ సమీపంలో గల టన్నల్ 45/3 టు 45/7 సమీపంలో ఒక బోగీ పట్టాలు తప్పింది. ఈ విషయాన్ని గమనించిన కో-పైలెట్ చాకచక్యంగా వ్యవహరిస్తూ రైలును కంట్రోల్ చేయడంతో సుమారు 15 బోగీలతో కూడిన పాసింజర్ ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పట్టాలు తప్పుతున్న ఆందోళనలో ఆ బోగీలో ఉన్న ప్రయాణికులు ఎమర్జెన్సీ కిటికీల ద్వారా కొందరు కిందకు గెంతేశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ జరగలేదు.

రైలు బోగీ పట్టాలు తప్పిన విషయాన్ని స్థానిక రైల్వే అధికారులు విశాఖలోని కార్యా లయానికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన డిఆర్ఎం అనుప్ సత్పతి మెడికల్, మరమ్మతులు చేపట్టే బృందంతో కలిసి యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ ట్రైన్‌లో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తప్పిన బోగిని క్రేన్ సహాయంతో పట్టాలులెక్కించారు. రైల్వే శాఖ అధికారులు యుద్ధ ప్రతిపాదికన పనులను చేపట్టి ఇటు పాసింజర్ రైలు, అటు గూడ్స్ రైలు మార్గాలను కొనసాగించేందుకు పనులను పూర్తిచేశారు. అక్కడి నుంచి 11.05 గంటలకు రైలు బయలుదేరింది. పట్టాలు తప్పిన ఈ బోగీలో సుమారు 50 మంది ప్రయాణికులు ఉన్నారని, ఎటువంటి ప్రమాదమూ జరగలేదని రైల్వే అధికారులు తెలిపారు. మార్గమధ్యలో పాసింజర్ రైలు నిలిచిపోవడంతో వేలాది మంది ప్రయాణికులు గంటల సమయం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పి ఉన్న దృశ్యం



రైలు నిలిచిపోవడంతో గంటల తరబడి ఇబ్బంది పడ్డ ప్రయాణికులు

నిరుపేద బాడీ బిల్డర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కూనవరం

జిల్లా, రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో ప్రతిభ కనబరచిన మండలంలోని ముల్లూరు గ్రామానికి చెందిన శీలం రమేష్‌కు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు రూ.3 వేలు ఆర్థిక సహాయం అందించారు. గ్రామంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా జరిగిన ఆటల పోటీల ముగింపు కార్యక్రమంలో నిరుపేద గిరిజన కుటుంబానికి రమేష్‌ను శాలువాతో సత్కరించి, ఆర్థిక సాయం అందజేశారు. అలాగే కరోనా కాలంలో చనిపోయిన మేకల అఖిల్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఐక్యతకు తోడ్పడతాయని తెలిపారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాదన్నారు. రమేష్ వంటి ప్రతిభవంతులైన నిరుపేద యువకులకు ప్రభుత్వం చేయూత అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బరపాటి ప్రకాష్‌రావు, సోమక సత్యనారాయణ, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు తాళ్లసాయి, గంపల రాజు, బర్ల రాజు, మేకల విజయ్, చిందిరం సాయి, శీలం రత్తయ్య, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



బాడీ బిల్డర్ రమేష్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు



వృద్ధురాలికి చీర అందజేస్తున్న సీతారాముల సంఘం ప్రతినిధులు

వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం దారకొండ గ్రామంలో దారాలమ్మ సీతారాముల సంఘం ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధ గిరిజన మహిళలకు శనివారం 20 చీరలను పంపిణీ చేశారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని గడుతూరి గిరి, గడుతురు చిన్నారావు ముందుకొచ్చి 20 చీరలను ముక్కనుమ పండగ సందర్భంగా అందజేశారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రం రేకపల్లిలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రభ ముద్రించిన 2023 కేలండర్‌ను జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, జీడిగుప్ప ఎంపీటీసీ వాళ్ల వెంకటేశ్వరరెడ్డి తదితరులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగుల కేలండర్‌ను పాఠకులకు అందించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. పత్రిక మరింత అభివృద్ధి దిశాగా ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్‌రావు, వైసిపి నాయకులు బొడ్డు సత్యనారాయణ, బాలు చిక్కాల, జనసేన మండల అధ్యక్షులు మలకాల సాయికృష్ణ, మాజీ జెడ్పీటిసి ముత్యాల రామారావు, టిడిపి వాణిజ్య విభాగం నాయకులు బీరక సూర్య ప్రకాష్ రావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బురక కన్నారావు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పిటిసి, వివిధ పార్టీల నాయకులు

గ్రామాల్లో తీర్థాల సందడి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగుంపేటలో తీర్థ మహోత్సవంను హనుమాన్ యూత్, జోగంపేట మాజీ సర్పంచ్ వరహాలబాబు, వైసిపి నాయకులు జువ్వల దేముడు, ఉప సర్పంచ్ లాలం స్వామినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా గొలుగొండ మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, నర్సీపట్నం డాక్టర్ రాయపురెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. తీర్థ మహోత్సవంను విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు నిర్వాహకులు ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాలం చినబాబులు, హనుమాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సిహెచ్.నాగపురంలో మంగళవారం తీర్థం మహోత్సవం సర్పంచ్ యలమంచిలి రఘు రాంచంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు సందడి చేశారు.

ముగిసిన క్రికెట్ లీగ్ పోటీలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో ఈనెల 12 నుండి ప్రారంభమైన క్రికెట్ లీగ్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. గారా ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో చివరి రోజు ఫైనల్లో చెరుకూరి, రావాడ టీములు పోటీ పడగా రావాడ టీం విజయం సాధించింది. ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలలో గెలుపొందిన విజేతలకు మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి రూ.20,000, ద్వితీయ బహుమతి రూ.10,000 తృతీయ బహుమతి రూ.5000 చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ, క్రీడల పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్రీడలతో మానసిక వికాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని కూడా పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, వివిధ జట్ల మేనేజర్లు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వివాహాల రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-కోటవురట్ల: వివాహాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే వాటిని పరిశీలించి రిజిస్ట్రేషన్ నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని స్థానిక సబ్‌రిజిస్ట్రార్ నరసింహమూర్తి తెలిపారు. బికేపల్లి గ్రామానికి చెందిన పసకడుగుల లచ్చారావు, రాజమండ్రి గ్రామానికి చెందిన అరుణ కుమారి దంపతులకు సబ్ రిజిస్ట్రర్ వివాహ ధ్రువీకరణ పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు వివాహాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బికెపల్లి ఎంపీటీసీ సభ్యులు పెట్ల రాంబాబు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని సీతంపాలెం గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా గొడిచెర్ల వైద్యాధికారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అప్తాల్మిక్ అధికారి మజ్జి గణపతిరావు నేత్ర పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 12 మందికి శస్త్ర చికిత్సలు, 48 మందికి కళ్ళజోళ్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని వచ్చే నెల 6న ఆపరేషన్స్ చేసేందుకు విశాఖలో ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు తరలిస్తామన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలో సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో సీతారామరాజు, ఈ ఓపిఆర్‌డి వెంకటనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, నక్కపల్లి సంపద తయారీ కేంద్రం శిక్షణ కేంద్రంగా ఎంపికైందని, చెత్త నిర్వహణపై పలు మండలాలకు సంబంధించి ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని మౌలిక సదుపాయాలతో షెడ్డు నిర్మాణానికి సంబంధించి మిగిలిన పనులు వేగ వంతంగా పూర్తి అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు సూచించారు. కేంద్రం చుట్టూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఉప సర్పంచ్ వీసం రాజు పాల్గొన్నారు.

వెండి ఆభరణాలు వితరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన దేవాలయంలో అమ్మవారికి పద్మనాభుని కన్నయ్య శెట్టి శాంతి దంపతులు, శ్రీరామ ఐరన్ షాప్ వ్యాపారి పెద్దబాబులు ఆలయ చైర్మన్ దేవత కామేశ్వరరావు సమక్షంలో సమర్పించారు. ఊక నాగేశ్వరరావు వెండి ముంజేటి కడియం అమ్మవారికి సమర్పించారు. స్థానిక ఐదు రోడ్ల జంక్షన్ వద్ద గల బాల వినాయక దేవస్థానంకు కొత్తూరు మీనాక్షి దంపతులు వెండి దండను అందజేశారు.

కనీస సదుపాయాలు కల్పించాలని ఆదివాసీల ఆందోళన

ప్రజాశక్తి -కొత్తకోట : తమ గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ రావికమతం మండలం చీమలపాడు శివారు జీలుగులోవ గ్రామ ఆదివాసీలు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొర్ర గసన్న, కొర్ర బాలరాజు తదితరులు మాట్లాడుతూ, జెడ్ జోగంపేట గ్రామానికి సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో సామలమ్మ కొండపై గత కొన్నేళ్లుగా సుమారు పది కుటుంబాలు జీవనం సాగిస్తున్నా మని, 50 మంది జనాభా కలిగిన తమకు నేటికీ కనీసం తాగునీరు, రహదారి, విద్యుత్ సౌకర్యం లేదన్నారు. జనాభాలో 16 మంది వరకూ చదువు కునే చిన్నారులు ఉన్నారని, వీరు విద్యకు నోచు కునేందుకు అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల వంటి సదుపాయాలు లేవని వాపోయారు. మూడు కిలో మీటర్ల దూరంలో జెడ్. జోగంపేట ప్రభుత్వ పాఠశాలకు అటవీ మార్గం లోనే రాక పోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. గ్రామంలో ఎవ్వరికి అనారోగ్యం కలిగినా వైద్య సేవలు అందలేదని, గత నెలలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ సీదిరి వెంకటరావు మార్గ మధ్యలో మృతి చెందాడని, ఈ సమస్యలపై గత ఆరు నెలల కిందట మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా గ్రామాన్ని సందర్శించి మౌళిక సదుపాయల కల్పనకు చొరవ చూపాలని ఆదేశాలు జారీ చేయగా ముగ్గురు ఆర్‌డివో స్థాయి అధికారులతో పాటు ట్రైబుల్ వెల్ఫేర్ అధికారులు గ్రామానికి వచ్చారని తెలిపారు. వచ్చిన ప్రతి అధికారి గ్రామాన్ని సందర్శించి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడమే గాని అందుకు కృషి చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఆదివాసీ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి మౌళిక సదుపాయల కల్పనకు చర్యలు చేపట్టాలని ఐదవ షెడ్యూల్ సాధన కమిటి జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు, ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సూరిబాబు తదితరులు డిమాండ్ చేశారు.

పొంచివున్న ప్రమాదం

ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగలు
ఆందోళనలో గృహ యజమానులు

ప్రజాశక్తి- రావికమతం: ఇంటిపై వేలాడుతున్న కరెంటు తీగలను తొలగించాలని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంపై తట్టబంద సర్పంచు గోకివాడ రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకు వచ్చి ప్రజలకు అందుబాటులో సేవలు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తుంటే విద్యుత్‌శాఖ అధికారులు ఆ దిశగా ఉండలేదన్నారు గ్రామ సమస్యలను అధికారులకు దృష్టికి తీసుకువెళ్లినా స్పందన కరువైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్, గ్రామస్తుల కథనం మేరకు...తట్టబంద పంచాయతీ సాయినగర్‌లో శరందాసు పరదేశి నాయుడు ఇంటి వద్ద నుంచి సిరసపల్లి అప్పారావు ఇంటి వద్ద వరకు సుమారు 20 గృహాల పై నుంచి కరెంటు తీగలు వేలాడుతున్నాయి. ఈ విషయం పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలియజేసినప్పటికీ కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాడుతున్న విద్యుత్ తీగలతో ఏ ప్రమాదం పొంచి వస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి పెను ప్రమాదం జరగకముందే వేలాడుతున్న తీగలను తొలగించాలని కోరుతున్నారు.

కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కొత్తకోట: భీమునిపట్నం -నర్సీపట్నం రోడ్డులో కల్వర్టు నిర్మాణ పనులను ఎట్టకేలకు అధికారులు పూర్తి చేయించారు. గత వారం రోజులుగా జరుగుతున్న వరస రోడ్డు ప్రమాదాలపై మంగళవారం గాలిలో ప్రజల ప్రాణాలు అనే కథనం ప్రజాశక్తిలో రావడంతో ఆర్అండ్‌బి శాఖ అధికారుల్లో చలనం వచ్చింది. ఈనెల 11న రాత్రి భార్యా భర్తలు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు కాగా, ఆదివారం రాత్రి కోటవురట్ల గ్రామానికి చెందిన వ్యక్తి టి.అర్జా పురం సమీపంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టులో ప్రమాదవ శాత్తు పడి తీవ్ర గాయలతో ఆసుపత్రి లో మృతి చెందిన సంఘటి తెలిసిందే. దీంతో వాహనదారులు ఈ రోడ్డు లో ప్రయాణం చేయాలంటేనే బేంబేలైతి పోవడంతో పాటు పలువురు విమర్శలు వ్యక్తం చేశారు. అధికారులు తాత్కాలికంగా దొండపూడి, టి.అర్జాపురం, పి. పొన్నవోలు, మేడివాడ గ్రామాల సమీపంలో సగం సగం నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులను వేగవంతం చేసి జేసిబి యంత్రంతో పూర్తి చేయించారు.

ఆదమరిస్తే అంతే!

ప్రజాశక్తి-కోటవురట్ల: జల్లూరు గ్రామంలో ప్రధాన రహదారి ఆంజనేయస్వామి గుడి వద్ద గెడ్డ కాలువ కల్వర్టుకు ప్రొటెక్షన్ గోడ లేక పోవడంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ, ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోలేదు. కొన్ని సందర్భాలలో వాహనాలు అదుపు తప్పి కాలువలో పడుతున్నాయి. నర్సీపట్నంకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉండటమే కాకుండా సమీపంలోని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, బికేపల్లి గ్రామానికి వెళ్లే వాహనదారులు రాత్రి సమయంలో ఆదమరిస్తే ప్రమాదం పొంచి ఉండక మానదు. అధికారులు ఇప్పటికైనా కాలువ వద్ద రక్షణ గోడ నిర్మించాలని పలు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కవగుంట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ ఎలక్ట్రీషియన్లకు సర్పంచు దాసరి సూర్య కుమారి వరహాలు చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందించి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామం పరిశుభ్రంగా ఉందంటే ఇందుకు పారిశుద్ధ్య కార్మికులే కారణమని కొనియాడారు. ఎంతో శ్రమించి పారిశుధ్య పనులు చేపడుతుంటారని తెలిపారు. ఇటువంటి సేవకులను గుర్తించుకోవడం సాంప్రదాయ పద్ధతిగా గుర్తించాలన్నారు. కరెంటు సమస్యకు అధికారుల చుట్టూ తిరగకుండా గ్రామస్థాయిలోనే పరిష్కరిం చుకునేందుకు ఎలక్ట్రిషన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు రొబ్బా వరకుమారి, ప్రగడ నాగేశ్వరావు, స్కూల్ చైర్మన్ నాయుడుబాబు, రాజన్న యూత్ అధ్యక్షులు చేపూరి శేషు, గ్రామ పెద్దలు వెచ్చం చిన్న నాగరాజు, వీపు అప్పారావు పాల్గొన్నారు.

కొట్లాటలో 20మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి-మాకవరపాలెం: జి.వెంకటాపురం శివారు నగరం గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన కొట్లాట కేసుపై డిఎస్పి ప్రవీణ్ కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. ఇరు వర్గాల వారిని విడి విడిగా విచారణ చేశారు. రెండు వర్గాల మధ్య గొడవ ఎందుకు వచ్చింది అనే దానిపై విచారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇరు వర్గాలకు చెందిన 20మందిపై కేసు నమోదు చేశామన్నారు. త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. గ్రామస్తులు ప్రశాంత వాతావరణంలో ఉండాలన్నారు. సమస్యలు ఉంటే చర్చించుకోవాలి తప్ప ఇలా తగాదాలకు దిగకూడదని సూచించారు. గ్రామంలో నిఘా పెట్టాలని ఎస్సై రామకృష్ణారావుకి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమణయ్య, దళిత సంఘం నాయకులు అప్పలరాజు, చలపతి రావు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి- నక్కపల్లి: రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బికె)లో ధాన్యం కొనుగోలు గడువు వచ్చే నెల 15తో ముగుస్తుందని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించే రైతులు వరి కుప్పలను త్వరితగతిన నూర్చి ప్రభుత్వం అందించే కనీస మద్దతు ధర సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఎంటియు 1064, 1061 రకాలు వేసిన రైతులు తప్పకుండా ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలకు విక్రయించాలని కోరారు. పలు గ్రామాల్లో వరి నూర్పులను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు.

ఆకట్టుకున్న నృత్యాలు

ప్రజాశక్తి-మాడుగుల: సంక్రాంతి సంబరాలలో భాగంగా మాడుగుల భారత నిర్మాణ సేన అధ్వర్యంలో సోమవారం రాత్రి చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. శ్రీదేవి అధ్వర్యంలో సాంప్రదాయ నృత్య కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ పోటీలలో గెలుపొందిన గాది రాయి, మాడుగుల, ఒమ్మలి టీములు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందగా వీరికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు శ్రీనాదు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, సీతా సతీష్, భారత నిర్మాణ సేన సభ్యులు గౌరీపట్టపు మహేష్, జాగాని ఈశ్వరరావు, కుంచా మధు తదితరులు పాల్గొన్నారు.

19న మండల సమావేశం

ప్రజాశక్తి-రావికమతం: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19న నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకన్న బాబు ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశంనకు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంనకు ఎవరు రాకున్నా వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సభ్యులు గ్రామ సమస్యలపై అడిగిన ప్రశ్నలకు పూర్తి సమాచారం ఉండాలని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం హైస్కూల్ 2003 పదో తరగతి విద్యార్థులు మంగళవారం అల్లూరి పార్కులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నివృత్తి చేసుకొని సందడి చేశారు.

చిన తీనార్లలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చినతీనార్ల గ్రామంలో గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యాధికారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రెండు రోజుల నుంచి గ్రామంలో వాంతులు, విరోచనాలతో పలువురు బాధపడుతుండటంతో వైద్యశిబిరం ఏర్పాటుచేసి రోగులను పరీక్షించి మందులను అందజేశారు. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న పలువురిని నక్కపల్లి సిహెచ్‌సికి తరలించి వైద్యం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ కుమార్ వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహారం తీసుకోవాలని రోగులకు సూచించారు. పండుగ సందర్భంగా నాన్ వెజ్ తినడంతోనే పలువురు వాంతులు, విరోచనాలు బారిన పడినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో శానిటేషన్ చర్యలు చేపట్టారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని చటర్జీపురం గ్రామంలో రెండు పూరిళ్ళు కాలిపోయాయని సామాజిక మధ్యమాల్లో చూసిన అల్లూరి యువ గిరిజన సేవ సంఘం అధ్యక్షుడు మల్లేష్, బట్టలు షాప్ అధినేతలు గోపి, తహీబ్‌బాబు, ప్రసాద్‌ల సహకారంతో మంగళవారం బియ్యం, కిరాణా సామాన్లు, కూరగాయలు, బట్టలు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.సన్యాసిరావు, జిగ్‌సా గోపి, వర్షిణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిఎం జగన్‌కు పెళ్లి ఆహ్వానం



సిఎం జగన్‌కు పెళ్లి శుభలేఖను అందజేస్తున్న డాక్టర్ దంపతులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : పైడి వారి పెండ్లి పిలుపులో భాగంగా డాక్టర్ సాకేత్, డాక్టర్ శ్రావికా రెడ్డి పెండ్లిశుభలేఖను తాడేపల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి, డాక్టర్ పైడి కళావతి దంపతులు అందజేశారు.

తెప్పోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 21న బహుళ పుష్య అమావాస్య రోజున నిర్వహించనున్న అత్యంత ప్రతిష్టాత్మక వేడుక తెప్పోత్సవ ఏర్పాట్లను సింహాచల దేవస్థానం ట్రస్టీ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుష్కరిణి చెరువు మెట్ల మార్గంలో ఉన్న నాచును తొలగించాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఉత్సవ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయని, స్వామి ఆశీస్సులతోఈ వేడుక జయప్రదమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

శిల్పారామంలో అలరించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు



నృత్యప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : సంక్రాంతి సంబరాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో మంగళవారం సాయంత్రం కుషాల్ డాన్స్ అకాడమీ వారిచే శాస్త్రీయ, జానపద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి కౌస్తుభం, జ్యోతి స్వరం, దశావతార శబ్దం, ముద్దుగారే యశోద, బ్రహ్మమొక్కటే, రామ శబ్దం, నడవరో గరుణగమన, దేవ దేవం భజే, చందమామలా ఉన్న, వల్లారి మావో, లాలాగూడా లంబాడీ పిల్లా, తమిళ ఫోక్, నల్ల చీర నల్ల రైక, కోయిలారే, గాజుల చప్పుడు అంశాలను తదితర విభిన్న నృత్యాలను ప్రదర్శించారు. దుర్గ భవాని, గీతాంజలి, యశస్విని, సారిక, రోషిణి, సీత, కారుణ్య, రఘు తదితర కళాకారులు నృత్యాలతో సందర్శకులను కనువిందు చేశారని శిల్పారామం పరిపాలనాధికారి టి. విశ్వనాథరెడ్డి తెలిపారు. శిల్పారామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గతకొద్దిరోజులుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ప్రతిరోజూ అధికసంఖ్యలో సందర్శకులు తరలివచ్చి, పలువురు కళాకారులు ప్రదర్శించిన విభిన్న నృత్యరీతులను తిలకించి, వారిని ఉత్సాహపరచడం ఎంతో ఆనందంగా ఉందని విశ్వనాథరెడ్డి తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే శంకుస్థాపనలు చేసిన పలు అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారు లను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళ వారం సాయంత్రం స్థానిక క్యాంప్ కార్యాలయంలో జివిఎంసి ఒకటో జోన్ అధికారులతో పలు అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒకటో జోన్ పరిధిలో ఉన్న నాలుగు వార్డుల్లో అభివృద్ధి పనులను వీలున్నంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎఇ ఎ సుమన్, వైసిపి నాయకులు ఎస్ కరుణాకర రెడ్డి, కె ఎల్లాజీ, జివి రమణ పాల్గొన్నారు

రవితేజకు పార్లె ఉత్సవ్ పురస్కారం



రవితేజను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి- సిరిపురం : హైటెక్ గ్రూప్ ఆధ్వర్యంలో ఒడిశా పర్లాకిమిడిలో నిర్వహించిన పార్లె ఉత్సవ్ -2023లో విశాఖకు చెందిన సినీనటుడు కళాతృష్ణ(రవితేజ)ను సంక్రాంతి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హైటెక్ చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి మాట్లాడుతూ, పర్లాకిమిడిలో పుట్టి, పెరిగిన రవితేజ, తెలుగు, ఒరియా సినీ ఇండస్ట్రీలో మంచి నటుడిగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. పురస్కార గ్రహీత రవితేజ మాట్లాడుతూ, తాను పుట్టిన పర్లాకిమిడిలో తన బంధువులు, అశేషజనవాహిని మధ్య అందుకున్న ఈ పురస్కార సన్మానం ఎంతో ప్రత్యేకమైందన్నారు. ఈ సందర్భంగా అమ్మ మహాలక్ష్మి చిటికిన వేలు పట్టుకుని పర్లాకిమిడి వీధుల్లో తిరిగిన రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చారు. మళ్లీ జన్మ ఉంటే కళాకారుడిగానే పుట్టాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సినీనటులు గౌతంరాజు, చిత్రం శ్రీను పాల్గొన్నార. జబర్దస్త్ అదుర్స్ ఆనంద్' బృందం స్కిట్, ఆటపాటలతో అలరించింది.

దళిత ద్రోహి జగన్ : మాజీ మంత్రి కొండ్రు మురళి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహి అని మాజీ మంత్రి, టిడిపి నాయకుడు కొండ్రు మురళి ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళితుల ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. జిఒ 77 తీసుకొచ్చి దళితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని తీసేసారని తెలిపారు. విదేశీ విద్యకు దూరం చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక 11 వేల ఎకరాల ఎస్‌సి భూములు వెనక్కు తీసుకున్నారని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టిల మీద అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. బలహీన వర్గాలకు వైసిపి ప్రభుత్వం ద్రోహం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం వస్తే వైసిపి తొలగించిన 28 పథకాలను తిరిగి అమలు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి మాట్లాడుతూ, ఎస్‌సి నిధులు దారి మళ్లించడంపై జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు.

సిఆర్‌పిఎఫ్ దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్‌గా సీతారాం



గొండు సీతారాం

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆల్ ఇండియా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎఐసిఆర్‌పిఎఫ్) సౌత్‌జోన్ రాష్ట్రాల కన్వీనర్‌గా ఎపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వర్చ్యువల్ విధానంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఎన్నికలో జాతీయ ఫోరంలో ప్రాతినిధ్యం వహిస్తున్న 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫోరం రాష్ట్ర, జాతీయ కన్వీనర్లు ఈ మేకు సీతారాంను ఎన్నుకున్నారు.

ఫోరం జాతీయ సలహాదారు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ శాంతా సిన్హా, మాజీ ఐపిఎస్.అధికారి వివి.లక్ష్మినారాయణ, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అశోక్ అగర్వాల్, అంతర్జాతీయ బాలల హక్కుల పరిరక్షకులు ఆర్.వెంకటరెడ్డి, డి.ప్రకాష్ సారథ్యంలో ఎన్నిక అనంతరం, సీతారాంకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ, జాతీయఫోరమ్‌కు ఎన్నిక కావడం ప్రమోషన్ ఇచ్చినట్లేనని, ఇదే స్ఫూర్తితో సేవలు అందిస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న గంధవరం ఉద్యోగులు, యువత

ప్రజాశక్తి -పద్మనాభం: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో సీటు సంపాదించినా, ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కొత్తల సోనియా అనే నిరుపేద విద్యార్థికి మండలంలోని గంధవరం గ్రామానికి చెందిన యువత, ఉద్యోగులు రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని అందించి తమ ఉదారతను చాటుకున్నారు. విద్యార్థిని సోనియా బాగా చదివి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.

భీమిలి బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : సాగర తీర స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా చిప్పాడ దివీస్ ఆధ్వర్యంలో స్థానిక బీచ్‌లో పది రోజులుగా సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను మంగళవారం క్లాప్ వాహనాలకు అందజేశారు. పదిరోజుల్లో ప్లాస్టిక్ 52 కిలోలు, ఇతర వ్యర్థాలు 95 కిలోలు, గాజు 15 కిలోలు సేకరించారు.. జివిఎంసి పారిశుధ్య కార్మికులు, దివీస్ సిఎస్ఆర్ ప్రతినిధులు నాగరాజు, శేఖర్ బాబు పాల్గొన్నారు

4వ జోన్‌లో దుకాణాలకు 28న బహిరంగ వేలం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జివిఎంసి 4వ జోన్ పరిధిలోని దుకాణాలు, కల్యాణ మండపాలు, క్యాంటీన్‌కు ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. ఆయన ప్రకటనలో పేర్కొన్న వివరాలిలావున్నాయి...

31వ వార్డులో టిఎస్ఆర్ వాణిజ్య సముదాయం (మొదటి అంతస్తు)లో 4 (ఎన్‌బి), 5, 6, 7, 10, 11, 14, 12 (ఎస్‌టి), 16 (డబ్ల్యుఎం), 17 (జనరల్), 18(ఎస్‌సి), కింద అంతస్తులో 46, 47 (జనరల్), 35వ వార్డు పరిధి స్ప్రింగ్ రోడ్డు వద్ద ఉన్న డైక్స్‌ట్యాంక్ వాణిజ్య సముదాయం కింద అంతస్తులో 9, 10, 11, 12 (జనరల్), 15 (ఎస్‌సి), మొదటి అంతస్తులో-1 (ఎస్‌సి), 2 (ఎస్.సి), 3 నుంచి 7వరకు, 9 నుంచి 14, 15 (జనరల్), పూర్ణ మార్కెట్ మెయిన్ రోడ్‌లో ఉన్న బుబాస్ ఫర్నిచర్ వాణిజ్య సముదాయం దుకాణం నెంబర్-2 (గ్రౌండ్ ఫ్లోర్), మొదటి అంతస్తు దుకాణం నెంబర్లు 5, 6 (మూడు షాపులు కలిపి ఒకే షాపుగా) వేలం వేయబడును.

31వ వార్డు పరిధిలో జగదాంబ వాణిజ్య సముదాయం నందు 1, 2, 3, 4, 5, 14, 13 (ఎస్.టి), 35వ వార్డులో ఓల్డ్ బస్టాండ్, పేజ్-2 దుకాణం నెంబర్లు 1 నుంచి 6, 8, 10, 11,13, 14, 15(జనరల్), 7 (ఎస్‌సి), 9(ఎస్‌టి), 12(ఎస్‌సి), 39వ వార్డులో లక్ష్మీ టాకీస్ దగ్గర పద్మనగర్ వాణిజ్య సముదాయములో 6, 11, 12 (జనరల్), 8 (ఎస్‌సి), 31వ వార్డులో జోన్-4 జివిఎంసి ఆఫీసు వద్ద సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం నందు మొదటి అంతస్తు దుకాణం-9, 37వ వార్డులోని రెల్లివీధి వాణిజ్య సముదాయంలోని దుకాణం నెంబర్-1, అంబేద్కర్ కల్యాణ మండపం, 28వ వార్డులో మీ-సేవ బిల్డింగ్ (ఆర్‌కె. బీచ్) దుకాణం నెంబర్-1, 39వ వార్డులో హెచ్‌జి ఆంగ్లో ఇండియన్ కల్యాణ మండపం, ఎవిఎన్ కాలేజ్ షాప్ రూములు, 1 నుంచి 4 (స్థానిక ఎస్ఎల్ఎఫ్ గ్రూప్ వారు మాత్రమే), రామకృష్ణ రైతు బజార్, రెల్లి వీధి ఫిష్ మార్కెట్ (రోడ్ సైడ్), ఎస్వీపి పూర్ణా మార్కెట్, జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఉన్న క్యాంటీన్‌కు బహిరంగ వేలంపాట నిర్వహించబడును.

ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు 4వ జోనల్ కార్యాలయంలో జరుగు వేలంపాటలో పాల్గొన వలసినదిగా కోరారు. పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయపు పనివేళలో సంప్రదించాలని సూచించారు.